క్లుప్తంగా

నగరానికి నూతన సీఐలు




వీరయ్య, త్రీ టౌన్ పుల్లారావు, వన్ టౌన్

కంబాలచెరువు: స్థానిక త్రీ టౌన్, వన్ టౌన్ పట్టణ లాండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు జి.మధుబాబు, ఎస్.లక్ష్మణరావును ఏలూరు రేంజ్ వీఆర్‌కు తరలించారు. ఈ మేరకు ఆదివారం పోలీసు శాఖ నుంచి ఉత్వర్వులు వెలువడ్డాయి. అలాగే వీఆర్‌లో ఉన్న వి.పుల్లారావును వన్‌టౌన్‌కు, ఎస్‌పీ.వీరయ్యను త్రీటౌన్‌కు సీఐలుగా బదిలీ చేశారు. వీరయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.

సమాజాభివృద్ధికి మనవంతు కృషి చేద్దాం



చెక్కు అందజేస్తున్న మానవత సేవాసంస్థ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో అవసరార్థులను గుర్తించి, వారికి సేవలు అందించడంతో మన వంతు కృషి చేద్దామని మానవత రీజినల్ చైర్మన్ సీపీ రెడ్డి పిలుపు నిచ్చారు. మానవత సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ ద్వారా సమాజంలో మౌలిక అవసరాలను తీర్చేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. సంస్థ ఉచితంగా నిర్వహిస్తున్న ఫ్రీజర్ బాక్సులు, శాంతి రథం, అంబులెన్స్ సర్వీసులు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న మూడేళ్ల జస్వికకు రూ.13,500 ఆర్థికసాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే సంస్థకు చెరుకూరి కృష్ణాజీ ఇనుప బీరువా, మాజీ సెక్రటరీ బీఎస్ఎన్ మూర్తి 20 కుర్చీలు అందించారు. కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ గాంధీ సత్యనారాయణ, ట్రెజరర్ పాల కృష్ణప్రసాద్ రెడ్డి, మాజీ అధ్యక్షులు మద్దుల మురళీకృష్ణ, ప్రసాద్, రుద్రమదేవి రాజ్యలక్ష్మి, ధర్మారెడ్డి, మానసిక విశ్లేషకులు దారపు నాగిరెడ్డి పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం



నిందితుడితో ఎస్ఈబీ అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: నగరంలోని సీతంపేటలో ఆర్యాపుర్యానికి చెందిన కె.అప్పారావు బెల్టుషాపు నిర్వహిస్తున్నాడన్న సమాచారంతో ఎస్ఈబీ రాజమహేంద్రవరం నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ, సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావును అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి తొమ్మిది 180 ఎంఎల్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

హక్కుల కోసం రాజీ లేని పోరాటం

ప్రకాశం నగర్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఎల్పీజీ గ్యాస్ కంపెనీలలో కార్మిక చట్టాలు అమలు కావడం లేదని, కార్మికులు తమ హక్కుల కోసం, సౌకర్యాల కోసం రాజీలేని పోరాటాలు సాగించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక విక్రమ్ హాల్లో ఆదివారం జరిగిన సంఘ 11వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సేనాపతి శివశరణ్, ఉపాధ్యక్షులుగా పి.రాంబాబు, రామకృష్ణ, ఎం.రాజు, ప్రధాన కార్యదర్శిగా జె.వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా డి.శ్రీనివాస్, జి.రాజ్ కుమార్, బాబీ, కోశాధికారిగా వెంకట అప్పారావు, మరో 15 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఏయూ పాలకవర్గ సభ్యుడిగా సత్యానందం



మధురపూడి: కోరుకొండ దాసరి అరవాలమ్మ డిగ్రీ కాలేజ్ అధినేత దాసరి సత్యానందం (బాబ్జీ) ఆంధ్రా యూనివర్సిటీ పాలకవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. ఆయన చాలా ఏళ్లుగా దాసరి అరవాలమ్మ డిగ్రీ కాలేజీ ద్వారా ఎందరో విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం లభించింది. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

నిమజ్జనానికి సర్వం సిద్ధం

- సుమారు వెయ్యి విగ్రహాలు వచ్చే అవకాశం
- మూడు షిఫ్టుల్లో సిబ్బంది నియామకం
- నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు



గోదావరిలో గణపతి విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాటు చేసిన పంటు, లాంచీ



నిషేధిత ఘాట్‌కు వెళ్లకుండా అడ్డంగా కట్టిన కర్రలు

రాజమహేంద్రవరం సిటీ: వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో గణనాథుని విగ్రహాల నిమజ్జనానికి నగరపాలకసంస్థ అన్ని చర్యలు తీసుకుంది. నగరంలోని హెడ్ వాటర్ వర్క్స్ సమీపంలో గల పూర్వపు ఇసుక ర్యాంపు వద్ద ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేసింది. నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలి వచ్చే సుమారు వెయ్యి విగ్రహాల నిమజ్జన కార్యక్రమం నిర్విరామంగా నిర్వహించేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

ప్రత్యేక పంటు, లాంచీ

ఆదివారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకూ మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించేందుకు సిబ్బందిని కేటాయించారు. వీరు 24 గంటలూ విధులు నిర్వహిస్తారు. ఉదయం వేళలో 10 మంది, మధ్యాహ్నం 15 మంది, రాత్రి 20 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తారు. వాహనాల్లో తరలివచ్చే విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేసేందుకు ప్రత్యేక పంటు, లాంచీ ఏర్పాటు చేశారు. విగ్రహాలను పంటుపైకి ఎక్కించేందుకు భారీ క్రేన్‌ను సిద్ధం చేశారు. కాగా.. ఉత్సవ కమిటీలు ఐదో రోజు నుంచే విగ్రహాలను నిమజ్జనానికి తీసుకువస్తున్నాయి. తీన్‌మార్ డప్పులు, డీజే డ్యాన్సులు, ప్రసాద వితరణతో అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాయి.

పలు ఘాట్లలో నిషేధం

గోదావరి ప్రవాహం అధికంగా ఉండటంతో నగరంలో పలు ఘాట్లలో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని నిషేధించారు. నగరంలో మొత్తం 17 ఘాట్లు ఉన్నాయి. వాటిలో కోటిలింగాల ఎక్స్‌టెన్షన్, కృష్ణ చైతన్య, లక్ష్మీ గణపతి, దుర్గా, వైగ్రామ్, సుబ్బాయమ్మ ఘాట్లలో నిమజ్జనాలను నిషేధిస్తూ నగరపాలకసంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. మిగిలిన పది ఘాట్లలో ప్రజలు తమ ఇళ్లలో పూజలు చేసిన చిన్ని విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అధికారులు అనుమతిచ్చారు.

అన్ని ఏర్పాట్లూ చేశాం



నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఏవిధమైన ఇబ్బంది లేకుండా ఉండేలా అన్ని ఏర్పాట్లూ చేశాం. వైద్యశిబిరం, తాగునీటి వసతి కల్పించాం. భక్తులు తీసుకునివచ్చిన పత్రిని వేరు చేసి గోదావరిలో మరో ప్రాంతంలో కలిపేందుకు చర్యలు తీసుకున్నాం. భారీ విగ్రహాలను మాత్రమే ఇసుక ర్యాంప్ ద్వారా నిమజ్జనం చేసుకోవాలి.

– ఐ.శ్రీనివాస్, శానిటరీ సూపర్ వైజర్, నగర పాలక సంస్థ

సిబ్బంది నియామకం



గణపతి విగ్రహాల నిమజ్జనం విధులు నిర్వర్తించడానికి ఈ నెల 28 వరకూ మూడు షిఫ్టుల్లో పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాం. భక్తులు నిబద్ధతతో నిమజ్జన ఉత్సవంలో పాల్గొనాలి. గోదావరి ప్రవాహం అధికంగా ఉన్నందున భక్తులు నదిలో దిగేందుకు ప్రయత్నం చేయవద్దు. ప్రమాదాలను గుర్తించి పలు ఘాట్లలో నిమజ్జనాన్ని నిషేధించాం.

– దినేష్‌కుమార్, కార్పొరేషన్ కమిషనర్

అన్ని ఆధారాలతోనే చంద్రబాబు అరెస్ట్



అడపా శ్రీహరి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో సంచలనంగా మారిన స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో సీఐడీ అధికారులు పూర్తి ఆధారాలతోనే మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని అరెస్ట్ చేసిందని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి స్పష్టం చేశారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు రిమాండ్ ఖైదీ 7691గా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో 15 రోజులుగా ఉన్నారన్నారు. స్కామ్‌లో ఆయన హస్తం ఉంది కాబట్టే దేశంలోనే అత్యుత్తమ లాయర్లు సైతం చంద్రబాబును జైలు గోడల మధ్య నుంచి బయటకు తేలేకపోతున్నారన్నారు. అయితే టీడీపీ నాయకులు మాత్రం చంద్రబాబు అరెస్ట్ అన్యాయమంటూ రోడ్డు ఎక్కడం వింతగా ఉందన్నారు. గతంలో జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి చంద్రబాబు, లోకేష్ అండ్‌కో ఇప్పుడేమి మాట్లాడాలో తెలియక సతమతమవుతున్నారన్నారు. తన అనుభవంతో అన్ని వ్యవస్థలను మేనేజ్ చేస్తూ వచ్చిన చంద్రబాబు పాపం ఇన్నాళ్లకు పండిందన్నారు. ఇష్టానుసారం కుప్పిగంతులేసిన నారా లోకేష్ తనను ఎక్కడ అరెస్టు చేస్తారనే భయంతో ఢిల్లీకి వెళ్లిపోయారన్నారు.

లాభాల బాటలో ఆర్యాపురం బ్యాంకు



బ్యాంకు సభ్యులకు గిఫ్టులు పంపిణీ చేస్తున్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో డాక్టర్ శ్రీనివాస్, గిరజాల రామకృష్ణ తులసి

- పాలకవర్గం మరింత అభివృద్ధి చేయాలి
- మహాజన సభలో ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లాభాల బాటలో పయనించడం చాలా సంతోషకరమని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. బ్యాంక్ చైర్ పర్సన్ గిరజాల రామకృష్ణ తులసి అధ్యక్షతన స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం బ్యాంకు 104వ మహాజన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ ఈ కోఆపరేటివ్ బ్యాంకుకు లక్ష మంది సభ్యత్వం ఉండటం అంటే, బ్యాంకు సేవలపై ఖాతాదారులకు ఎంత విశ్వాసం, అభిమానముందో స్పష్టమవుతోందన్నారు. వందల కోట్ల టర్నోవర్‌తో ఖాతాదారులకు సంతృప్తికర సేవలు అందిస్తున్న ఈ బ్యాంకు త్వరలోనే ఏ గ్రేడ్ స్థాయికి చేరగలదనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ బ్యాంకు పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించిందని, వారి సమర్థత కారణంగా బ్యాంకు లాభాల బాటలో పయనిస్తోందన్నారు. ఏ ఆశయంతో ఈ బ్యాంకును దివంగత సరిపెల్ల విశ్వేశ్వర ప్రసాద్ స్థాపించారో, ఆయన ఆశయ సాధన దిశగా పాలకవర్గం, అధికారులు కృషి చేయాలని సూచించారు. అనంతరం మహాజన సభకు విచ్చేసిన సభ్యులందరికీ బ్యాంకు సమకూర్చిన గిఫ్టులను ఎంపీ భరత్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, బ్యాంకు సీఈఓ కొండేటి స్వరాజ్యలక్ష్మి, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, నగర బీసీ సెల్ చైర్మన్ మజ్జి అప్పారావు, బ్యాంకు పాలకవర్గ సభ్యులు మజ్జి నూకరత్నం, నక్కెళ్ల బాబూరావు, మార్గాని సురేష్, పెంకే సురేష్ కుమార్, పతివాడ రమేష్ బాబు, రాయుడు గణేష్, వీణం వెంకటేశ్వరరావు, గొర్రిపాటి లీలా గంగాధరరావు, వెంట్రపాటి సురేష్, యర్రా ప్రసాదరావు పాల్గొన్నారు.

చెత్త రహితంగా రాజమహేంద్రవరం

- ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం
- కలెక్టర్ మాధవీలత



జెండా ఊపి సైకిల్ థాన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం సిటీ: నగరాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత పిలుపునిచ్చారు. స్వచ్ఛతాహి సేవ, ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0 కార్యక్రమాలలో భాగంగా ఆదివారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక వై.జంక్షన్ నుంచి పుష్కరఘాట్ వరకూ సైకిల్ థాన్ నిర్వహించారు. జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా గ్రామాలను, పట్టణాలను పరిశుభ్రతగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ఇండియన్ స్వచ్ఛ లీగ్ 2.0 కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సెప్టెంబరు 17న ప్రారంభమైన ఈ కార్యక్రమం గాంధీ జయంతి అక్టోబర్ రెండు వరకూ నిర్వహిస్తామన్నారు. యువత ముందుకు వచ్చి స్వచ్ఛందంగా పరిసరాల పరిశుభ్రతకు తమవంతు సహకారం అందించాలన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ శనివారం నిర్వహించిన గోదావరి ఘాట్ పరిశుభ్రత కార్యక్రమంలో 2వేల మంది ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారన్నారు. ఈ రోజు సైకిల్ ర్యాలీ ద్వారా స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంపై ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా రానున్న శుక్రవారం ఆర్ట్స్ కళాశాల మైదానంలో మెగా ఐఎస్ఎల్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నగర ప్రజలందరూ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ యశ్వంత్ కుమార్, మున్సిపల్ హెల్త్ అధికారి డాక్టర్ ఎ.వినూత్న, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ దిలీప్ కుమార్, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, జేసీఐ సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక నాయకుడు కొరటాలకు నివాళి

ప్రకాశం నగర్: పేపర్‌మిల్లు వద్ద గల సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం కార్మిక నాయకుడు కొరటాల సత్యనారాయణ శతజయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజు లోవ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కొరటాల సత్యనారాయణ స్వాతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడారని, తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారని, కార్మిక సంఘాలను ఏర్పాటు చేసి కార్మిక హక్కుల కోసం అనేక పోరాటాలు సాగించారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.పూర్ణం రాజు, సీఐటీయూ నాయకులు లవ కుమార్, సత్తిరాజు పాల్గొన్నారు.

బధిరుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- పథకాలను వినియోగించుకోవాలి
- ఏడీ రామ్ కుమార్



ప్రియదర్శిని ఆశ్రమంలోని బధిరులతో ఏడీ రామ్ కుమార్

కంబాలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను బధిరులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లాల వికలాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్ కుమార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కాలనీలోని ప్రియదర్శిని చెవిటి, మూగ పిల్లల ఆశ్రమంలో జరుగుతున్న ప్రపంచ బధిరుల వారోత్సవాలకు ఆదివారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అందిస్తోందన్నారు. ప్రియదర్శిని ఆశ్రమంలో నిర్వహిస్తున్న ప్రపంచ బధిరుల వారోత్సవాలు చాలా బాగున్నాయని ప్రశంసించారు. ఆశ్రమ నిర్వాహకురాలు కె.స్వప్నవర్మను అభినందించారు. ముందుగా ఆయన బధిరుల దినోత్సవ కేక్‌ను కట్ చేసి, వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. బధిరులకు ఏఅవసరం ఉన్నా వెంటనే వారికి సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆశ్రమంలోని కంప్యూటర్ ల్యాబ్, స్పీచ్ హియరింగ్ రూమ్‌లను చూసి నిర్వాహకులను అభినందించారు. క్రికెట్, కబడ్డీ వంటి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం బధిరులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు కె.స్వప్నవర్మ, ప్రిన్సిపాల్ కె.ఆశాలత, ప్రేమలత, నిర్మల, ఎలిషా రాజ్‌కుమార్, ప్రియాంక పాల్గొన్నారు.

వక్రతుండ.. మహాకాయ..



హుకుంపేట డి బ్లాకులో వినాయకునికి పూజలు చేస్తున్న చందన నాగేశ్వర్



రామపాదాల రేవు వద్ద నిమజ్జనోత్సవానికి గణనాథుని తీసుకువస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: వినాయక చవిత ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుగుతున్నాయి. ప్రముఖ ఆలయాలతో పాటు పందిళ్లలో ఏర్పాటు చేసిన గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. హుకుంపేట డిబ్లాకులోని చవితి పందిళ్లను ఆదివారం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ యువత దైవభక్తితో పాటు సేవా కార్యక్రమాల్లోనూ ముందుండాలని సూచించారు. ఆయన వెంట శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

విద్యాగణపతి పూజ

ధవళేశ్వరం: గ్రామంలోని మెండా వారి వీధిలో ఏర్పాటు చేసిన వినాయక పందిరి వద్ద ఆదివారం విద్యాగణపతి పూజ నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పోలిశెట్టి సాయి తాతారావు, మెండా రాజేష్, బేవర కోటేశ్వరరావు, మెండా చిన బాబు, అల్లంపల్లి ముత్యాలు, నాగబాబు తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులు విద్యాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. దూడే బాలాజీ చిన్నారులకు పుస్తకాలు ,పెన్నులు అందజేశారు.

రామపాదాల రేవులో నిమజ్జనం

గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం వివిధ చోట్ల ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను ధవళేశ్వరంని రామపాదాల రేవులో నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు భారీ ఊరేగింపులతో విగ్రహాలను గోదావరి వద్దకు తీసుకువచ్చారు. నిమజ్జనం సందర్భంగా ధవళేశ్వరం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

భారీ గరికమాల అలంకరణ

కడియం: కడియపులంక ముసలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యాలక్ష్మీ గణపతి స్వామికి ఆదివారం భారీ గరికమాలను భక్తులు అలంకరించారు. అనంతరం జరిగిన ప్రత్యేక పూజల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దుళ్ల శివాలయం రోడ్డులోని లక్ష్మీగణపతి స్వామి ఉత్సవ పందిరి వద్ద గణపతి హోమం వైభవంగా జరిగింది. బాదంపూడి శివయ్య శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ఈ హోమం నిర్వహించారు.



ధవళేశ్వరం మెండావారి వీధిలో విద్యాగణపతి పూజ



కడియపులంకలో భారీ గరిక మాల అలంకరణ

వినాయక ఆలయ ప్రారంభోత్సవం



వినాయకుని దర్శించుకుంటున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక 42వ డివిజన్ మున్సిపల్ కాలనీలోని రత్నంపేట వాంబే గృహాల వద్ద వినాయక స్వామి ఆలయ ప్రారంభోత్సవంలో ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినాయక చవితి మహోత్సవాల సమయంలో ఇక్కడ గణపతి మందిర ప్రారంభోత్సవం శుభపరిణామమన్నారు. అనంతరం కోరుకొండ రోడ్డు దుర్గ గుడి ఆటో స్టాండ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న లక్ష్మీ గణపతి 19వ వార్షికోత్సవం, గణపతి నవరాత్ర వేడుకలలో పాల్గొన్నారు. 48వ డివిజన్‌లో గణపతి, లక్ష్మీగణపతి మంటపాలను సందర్శించారు. దేవీచౌక్‌లో ఆటోస్టాండ్ ఆధ్వర్యంలోనూ, బొమ్మూరు పోలీసు స్టేషన్ సమీపంలో కారు మెకానిక్ రాజు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు తదితరులు ఉన్నారు.

ఈ హీరోను ఆశీర్వదించండి

త్వరలో విడుదల కాబోతున్న ఓయ్ ఈడియట్ చిత్ర కథా నాయకుడు యశ్వంత్ మన నగరానికి చెందిన వాడేనని, అతడిని మనమంతా ఆశీర్వదించాలని ఎంపీ భరత్ రామ్ అన్నారు. హ్యాపీస్ట్రీట్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇలాంటి యువతను ప్రోత్సహిస్తే మన నగర కీర్తి ప్రతిష్ఠలు మరింత ఇనుమడిస్తాయన్నారు. ఆ సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ హీరో యశ్వంత్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా దీపారాధన



దీపారాధనలో పాల్గొన్న మహిళలు

రాజానగరం: దివాన్ చెరువు శివారు బీజాపూరి కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్ర ఉత్సవ మంటపంలో కాలనీ మహిళలు ఆదివారం రాత్రి వినాయకుడు, స్వస్తిక్ ఆకారాలలో దీపారాధన చేశారు. అలాగే రాజానగరం గాంధీ బొమ్మ సెంటరులోని లక్ష్మీ గణపతి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో చిన్నారులు పాల్గొన్నారు.

బాల గణపతి నిమజ్జనం

బిక్కవోలు: మండలంలోని పందలపాక వెలంపేట ఉసిరి చెట్టు వద్ద కొలువుదీర్చిన బాల గణపతి నిమజ్జనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తీన్‌మార్ డప్పులు, బాణసంచాతో వినాయకుడిని ఊరేగింపుగా తీసుకెళ్లి గౌరిశంకర ఆలయం వద్ద ఉన్న తుల్యభాగ నదీ తీరంలో నిమజ్జనం చేశారు. అధిక సంఖ్యలో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన చేశారు.